సాక్షి అనకాపల్లి

సోమవారం । 26 । జూన్ । 2023



పరశురామునిగా..

అనకాపల్లిటౌన్: గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్‌లో జగన్నాథస్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



బొర్రాకు పర్యాటకుల తాకిడి

అనంతగిరి: బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం 1700 మంది బొర్రాగుహలను తిలకించారు.సుమారు రూ.1.33 లక్షల ఆదాయం లభించింది.



స్వీయశక్తిపై నమ్మకంతోనే గెలుపు

స్వీయశక్తి సామర్థ్యాలపై నమ్మకం ఉన్నవారు పోటీల్లో విజేతలుగా నిలుస్తారని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

మినీ జాబ్‌మేళా రేపు

అనకాపల్లిటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 27న మినీజాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ వరకూ చదువుకున్న 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

బడి బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నబ్బాయ్

అనకాపల్లిటౌన్: బడిని మరింత బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం పిలుపు మేరకు బడిబయట పిల్లలను స్కూళ్లలో చేర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిని ప్రభుత్వబడికి ఆహ్వానించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, కోశాధికారి జోగా రమేష్, కార్యదర్శులు పాలిమేర రామచంద్రరావు, ప్రకాష్, సతీష్, రమేష్ రావు సభ్యులు పాల్గొన్నారు.

అడిషనల్ డీఎంహెచ్‌వోగా బాలాజీ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ బాలాజీ

సాక్షి, అనకాపల్లి: అడిషనల్ డీఎంహెచ్‌వోగా డాక్టర్ ఎం.ఎస్.వి.కె.బాలాజీ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ శారదాబాయ్ నంద్యాలకు, నంద్యాల్లో పనిచేస్తున్న డాక్టర్ బాలాజీ ఇక్కడకు బదిలీ అయ్యారు. జిల్లా లెప్రర్సీ, ఎయిడ్స్, టీబీ అధికారిగా డాక్టర్ బాలాజీ విధులు నిర్వహిస్తారు.

పుష్పయాగానికి పూలు తరలింపు



పుష్పయాగానికి తరలిస్తున్న వివిధ రకాల పూలు

ఎంవీపీకాలనీ: తిరుమల శ్రీ గోవిందరాజ స్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి పూలు తరలివెళ్లాయి. కార్తీక దినోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేకరించిన పూలు యాగానికి పంపించారు. ఆదివారం ఉదయం ఎంవీపీలోని టీటీడీ ఈ–దర్శనం కౌంటర్ వద్ద ఈ పూలను ప్రదర్శించారు. తొలుత మహిళా భక్తులు పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాకింగ్ చేశారు. అనంతరం సంకల్పం చేసి శాస్త్రోక్తంగా పుష్పయాగం కోసం తిరుమలకు ఈ పూలు తరలించారు. వీటిలో కలువలు, తామరలు, తులసి, మల్లి, జాజి, సంపంగ ఇలా వివిధ రకాలకు చెందిన పూలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళీశ్వరశర్మ, అధ్యాత్మికవేత్త సత్యకుమార్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

నేడు జగనన్నకు చెబుదాం, డయల్ యువర్ మేయర్

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీలో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు మేయర్ చాంబర్‌లో డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ఉంటుంది. పౌరులు ఈ కార్యక్రమాల ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

టీడీపీ తుస్సు యాత్ర..

- ఆశించిన స్థాయిలో స్పందన లేక డీలా
- ముఖం చాటేసిన గంటా వర్గం
- అయ్యన్న ఇలాకాలో మరోసారి అసమ్మతి
- నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, యర్రాపాత్రుడు డుమ్మా
- మునగపాకలో గొడవకు దిగిన తెలుగు తమ్ముళ్లు
- రోలుగుంట, రావికమతం, బుచ్చియ్యపేట, చోడవరంలో చప్పగా సాగిన యాత్ర



చోడవరంలో జనం లేక వెలవెలబోయిన బస్సు యాత్ర

సాక్షి, అనకాపల్లి: 'భవిష్యత్తు గ్యారెంటీ' అనే పేరుతో జిల్లాలో టీడీపీ నిర్వహిస్తున్న బస్సు యాత్ర చప్పగా సాగుతోంది. పాయకరావుపేట, యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం నియోజవర్గాల్లో ఆశించిన స్థాయిలో స్పందన లేక అడుగడుగునా యాత్ర డీలా పడింది. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దూషించాలనే ప్రధాన ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ యాత్రకు జనాదరణ లేకపోవడంతో టీడీపీ అధిష్టానం ఆశలన్నీ నీరుగారాయి. ఇక యాత్రలో సెల్ఫీచాలెంజ్ కార్యక్రమమైతే మొదటి రోజే తుస్సుమంది. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనితల వ్యతిరేక వర్గానికి నాయకత్వం వహిస్తున్న మరో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన వర్గీయులు ఈ యాత్రను పట్టించుకోలేదు. జిల్లాలో అధికంగా ఉన్న కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులైతే యాత్రకు ఆది నుంచి దూరంగా ఉంటున్నారు. యాత్ర ప్రారంభంలోనే పాయకరావుపేటలో వంగలపూడి అనిత వ్యతిరేక వర్గం ఈ యాత్రలో పాల్గొనడం లేదు. ఉత్తరాంధ్రలో ఉన్న దాదాపు సీనియర్ టీడీపీ నాయకులంతా పాల్గొంటారని తెలుగు తమ్ముళ్లు ఆశించినా... పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పూర్తిగా డుమ్మా కొట్టారు. జిల్లాలో యాత్రను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, టీడీపీ మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత నాయకత్వంలో సాగడం ఇష్టం లేకనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు దుమ్మాకొట్టారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో ఉన్న పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులందరిని ఆహ్వానించి తమ సత్తా నిరూపించుకోవాలని చేసిన ప్రయత్నాలకు ఆదిలోనే విఫలమయ్యాయి.

అయ్యన్న ఇలాకాలో అసమ్మతి 'గంట'

బస్సు యాత్ర పాయకరావుపేట నియోజకవర్గం నుంచి ప్రారంభమైనప్పటి నుంచి నర్సీపట్నం వరకూ అడుగడుగునా ఇబ్బందులే ఎదురయ్యాయి. గత ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో టీడీపీ పాతాళంలోకి కూరుకుపోయింది. ఇప్పుడు కూడా ఆ పార్టీలో గ్రూపు రాజకీయాలు ఎక్కువగా ఉన్నాయి. తనకు తిరుగులేదని చెప్పుకునే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు నాయకత్వంలో సాగిన మూడోరోజు యాత్రలో సొంత నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప, యర్రాపాత్రుడు పాల్గొనలేదు. ఏడాదిగా అయ్యన్నపై గుర్రుగా ఉంటున్న వీరిపై గంటా వర్గంగా కూడా ముద్ర ఉంది. గతంలో మాజీ మంత్రి గంటాపై అయ్యన్న నోరు జారినప్పటి నుంచి వీరు పూర్తిగా అయ్యన్నకు దూరంగా ఉంటున్నారనే ఆరోపణలు కాస్త ఈ యాత్రతో మరింత బట్టబయలయ్యాయి. టీడీపీ సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడు తన గ్రామంలో ఒక ఉత్సవానికి నియోజకవర్గంలో టీడీపీ నాయకులందరినీ పిలిచారు గానీ..అయ్యన్నను, ఆయన వర్గీయులను పిలవలేదు.తాజా పరిణామంతో విభేదాలు తేటతెల్లమయ్యాయి.

అసహనంగా తెలుగు తమ్ముళ్లు..

ఈ యాత్రతో జిల్లాలో పార్టీ భవిష్యత్తు కనుమరుగవుతుందేమోనని తెలుగు తమ్ముళ్లు భయపడుతున్నారు. ఉత్తరాంధ్రలో ఉన్న సీనియర్లంతా వస్తారేమో అన్న వారి ఆశ నిరాశైంది. నేతల్లో విభేదాలు ఈ యాత్రలో స్పష్టంగా కనిపించాయి. షెడ్యూల్ ప్రకారం యాత్ర జరగకపోవడంతో కార్యకర్తల్లో అసహనం మొదలైంది. ఏ సమయంలో యాత్ర వస్తుందో...రూట్ మ్యాప్ ఎలాగో కూడా తెలియక సతమతమైపోతున్నారు. తమ ప్రాంతానికి ఎప్పుడోస్తారో..యాత్రలో ఏ నాయకుడు మాట్లాడతాడో కూడా వచ్చే వరకూ కూడా కార్యకర్తలు తెలియడంలేదు. ఒక్క మొదటి రోజు మినహాయిస్తే ఏ రోజూ కూడా యాత్ర సక్రమంగా సాగలేదని టీడీపీ కార్యకర్తలు చిరాకుకు లోనవుతున్నారు.

స్విమ్మింగ్ పోటీలకు విశేష స్పందన

రాష్ట్రస్థాయికి పలువురి ఎంపిక



ఈత పోటీల్లో పాల్గొన్న పిల్లలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఈత పోటీలకు విశేష స్పందన లభించింది. అనకాపల్లి జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారు నర్సరావుపేటలో వచ్చే నెల 8,9 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సుందరరావు, సీహెచ్ దేముడులు తెలిపారు. కేటగిరి–3 బాలికల విభాగంలో లహరి,మోక్షిత,మేఘవర్ష, బాలుర విభాగంలో హర్షిల్ క్రిష్, పద్మాకర్, కేటగిరి–2 బాలికల విభాగంలో వైశాలి, మహేశ్వరి,హాసిని, బాలుర విభాగంలో ధనుష్, అప్పలనాయుడు,శ్రీరాజ్ విజేతలుగా నిలిచారని చెప్పారు. కేటగిరి–1 బాలికల విభాగంలో మధు దీపిక,కీర్తిలు విజయం సాధించారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి చంద్రశేఖర్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కార్గో' ఆదాయం రోజుకు రూ.20 లక్షలు

ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు అప్పలనాయుడు



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు అప్పలనాయుడు

యలమంచిలి: ఆర్టీసీ కార్గో సేవల ద్వారా ఉత్తరాంధ్రలో రోజుకు రూ.20 లక్షల చొప్పున ఆదాయం వస్తోందని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.ఎ.అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్శిల్ సర్వీస్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మట్లాడుతూ పలాస నుంచి పాయకరావుపేట వరకు 45 పార్శిల్ సర్వీస్ కేంద్రాలు, 65 ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా రోజుకు సుమారు రూ.20 లక్షల ఆదాయం సమకూరుతోందని తెలిపారు. కార్గో సేవలను మరింతగా విస్తృతపరిచి రూ.30 లక్షల వరకూ ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీకి ప్రయాణికుల ద్వారా 70 శాతం ఆక్యుపెన్సీ ఆదాయం వస్తోందని తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో రూ.30 లక్షలతో డ్రైవర్లకు విశ్రాంతి భవనాన్ని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు యలమంచిలి పట్టణంలో కాంప్లెక్స్‌కి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాంప్లెక్స్‌లో ఖాళీగా దుకాణాలను లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు ఇప్పటికే టెండర్లు ఆహ్వానించామని, కావల్సిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అంతకు ముందు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిర్మాణంలో ఉన్న నూతన గృహ సముదాయాన్ని ఆయన పరిశీలించారు.

ది విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు వ్యాపార లక్ష్యం రూ.7728 కోట్లు

ఘనంగా 108వ మహాజన సభ



మాట్లాడుతున్న బ్యాంకు అధ్యక్షుడు రాఘవేంద్రరావు

మద్దిలపాలెం(విశాఖ): దివిశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో రూ.7,728.43 కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నామని బ్యాంకు అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. బ్యాంకు 108వ మహాజన సభ మద్దిలపాలెంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రూ.4,350కోట్ల డిపాజిట్లు సేకరించాలనిలక్ష్యంతో ముందుకువెళ్తున్నామన్నారు. రూ.3,378 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. 2022 –23 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదికలో భాగంగా రూ.3,929 కోట్ల డిపాజిట్లు సేకరించగా, రుణాలు రూ.3,050 కోట్లు ఇచ్చామన్నారు. వ్యాపారం రూ.7,026 కోట్లు సాగిందని వివరించారు. బ్యాంకు సభ్యులు 92,831మంది కాగా, షేర్ ధనం రూ.305 కోట్లు నమోదయిందన్నారు. దీంతో దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని ప్రకటించారు.గతఆర్థిక సంవత్సరంలో రూ.73.14 కోట్లు లాభాలు ఆర్జించామని పేర్కొన్నారు. బ్యాంకు రిజర్వ్‌నిధి రూ.389 కోట్లుకాగా ఆస్తులు రూ.179 కోట్లని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీలు, ఇతర బ్యాంకులలో పెట్టుబడులు రూ.1620 కోట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు. మానం ఆంజనేయులు మాట్లాడుతూ సహకార బ్యాంకులపై రిజర్వ్ బ్యాంకు అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సహకార రంగంలో సంస్కరణల కోసం ఏర్పాటు చేసిన విశ్వనాథన్ కమిటీ సిపార్సులు, జాయింట్ పార్లమెంటరీ కమిటీ పరిశీలన తర్వాత ప్రస్తుతం చట్టంచేసే దశలో ఉందని తెలిపారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు.

చేరువైన దూరవిద్య

- ప్రవేశాల సంఖ్యలో గణనీయమైన వృద్ధి
- సెమిస్టర్ విధానంలో పరీక్షల ప్రక్రియ
- ఆన్‌లైన్‌లో విద్యార్థులకు సమగ్ర సేవలు

ఏయూక్యాంపస్: అందుబాటులో ఉన్న సాంకేతికతను అనుకూలంగా మార్చుకుంటూ.. ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం తన సేవలను విద్యార్థులకు మరింత చేరువ చేస్తోంది. మారుమూల గ్రామాల నుంచి అంతర్జాతీయంగా పలు దేశాలకు విస్తరిస్తోంది. మొత్తం మీద కొన్నేళ్లుగా దూరవిద్య కేంద్రం ప్రాశస్త్యం పెరుగుతోంది. తాజాగా ఆన్‌లైన్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించారు. సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఒక్క క్లిక్‌తో సమస్త సేవలు : ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యలో ప్రవేశాల నుంచి పరీక్షల వరకు సమస్త సేవలను ఒక్క క్లిక్‌తో పొందేలా అధికారులు చర్యలు చేపట్టారు. దూరవిద్య కేంద్రానికి రాకుండానే విద్యార్థి తను ఉన్న ప్రాంతం నుంచే https://www.andhrauniversity-sde.com/ను సందర్శించి నేరుగా ప్రవేశం పొందవచ్చు. ఏటా అకడమిక్ ఇయర్‌గా జూలై, క్యాలెండర్ ఇయర్‌గా జనవరిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ప్రవేశాల నుంచి కోర్సు పూర్తయ్యే వరకు పూర్తి స్థాయిలో సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తారు. విద్యార్థి ప్రవేశం పొందే సమయంలోనే ఫీజులు సైతం చెల్లించి, నేరుగా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరయ్యే అవకాశం కల్పించారు. ప్రతి విద్యార్థికీ ఒక లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అందిస్తారు. ప్రవేశం పొందిన తర్వాత విద్యార్థి తన లాగిన్ నుంచి నేరుగా సిలబస్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.

వాట్సాప్ గ్రూప్‌ల ఏర్పాటు : ప్రతీ కోర్సులో 30 మార్కులకు అసైన్‌మెంట్, 70 మార్కులకు వార్షిక పరీక్ష ఉంటాయి. అసైన్‌మెంట్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రాలు సైతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. అలాగే ప్రవేశాలు పొందిన విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్‌లు రూపొందించి, సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి అన్ని కోర్సులకు సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. పరీక్షల్లో పారదర్శకత పెంచడానికి ఓఎంఆర్ విధానం అమలు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థులకు అప్రెంటిస్

బీఏ, బీకాం దూరవిద్యలో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్టైఫండ్‌తో కూడిన అప్రెంటిస్ అందించే దిశగా అధికారులు పనిచేస్తున్నారు. వివిధ పరిశ్రమలతో అనుసంధానం చేసుకుని, వీరికి వేతనంగా కూడిన శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. వచ్చే నెలలో ప్రవేశం పొందే విద్యార్థుల నుంచి అన్ని కోర్సులకు గ్రేడింగ్, సెమిస్టర్ విధానం అమలు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏయూ దూర విద్యాకేంద్రానికి 98కి పైగా పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచి విద్యార్థి ప్రవేశం పొందినా.. సమీపంలోని పరీక్షల కేంద్రాలనే కేటాయిస్తారు.

ఆన్‌లైన్‌లో కోర్సులు



విదేశీ విద్యార్థులకు సైతం చదువుకునే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం ఎం.ఏ సోషియాలజీ, బీకాం కోర్సులు ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. త్వరలో ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంకాం కోర్సులను సైతం ఆన్‌లైన్‌లో నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఏయూ దూరవిద్య కేంద్రం సామాజిక బాధ్యతగా ఖైదీలు, దివ్యాంగులకు ఉచితంగా విద్య అందిస్తోంది.




ఏయూ దూరవిద్య కేంద్రం

దూరవిద్య కేంద్రంలో ఐదేళ్లుగా ప్రవేశాలను పరిశీలిస్తే.. నూతన విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య
2018-19	10,292
2019-20	16,200
2020-21	15,151
2021-22	21,751
2022-23	30,566

2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల సంఖ్యను రెట్టింపు చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

నూతన విధానాలతో సత్ఫలితాలు



అధిక శాతం మందికి దూరవిద్యను చేరువ చేసే విధంగా నూతన విధానాలు అమలు చేస్తున్నాం. ప్రస్తుతం అమలు చేస్తున్న ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాల ప్రక్రియకు మంచి ఆదరణ లభిస్తోంది. విద్యార్థులకు వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– ఆచార్య కె.విశ్వేశ్వరరావు, సంచాలకుడు, ఏయూ దూరవిద్య కేంద్రం

రైతన్న మురిసేలా..
శివారు తడిసేలా..



పూడికతీతతో కళకళలాడుతున్న కాలువ


అన్నదాతల్లో ఆనందం పరవళ్లు తొక్కుతోంది.. కన్నీటి కష్టాలు తీరడంతో సంతోషం తొణికిసలాడుతోంది...నీరు ఎప్పుడు వస్తుందా అన్ని రేయింబవళ్లు ఎదురు చూపులు చూసే ఆ కళ్లు ఇప్పుడు హర్షాతిరేకాలు వర్షిస్తున్నాయి. 11 గ్రామాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే కల్యాణపులోవ రిజర్వాయర్ పంట కాలువలన్నింటిలో పూడిక తీయడంతో శివారు భూములకు కూడా సాగునీరు అందనుంది.

- కల్యాణపు లోవ రిజర్వాయర్ కాలువల్లో పూడిక తొలగింపు
- విప్ ధర్మశ్రీ చొరవతో పనులు
- పరిష్కారమైన దీర్ఘకాల సమస్య
- శివారు భూముల సాగునీటికి ఢోకా లేదంటున్న రైతన్నలు



కాలువ బాగుచేయాలంటూ ధర్మశ్రీని కోరుతున్న రైతులు(ఫైల్)

రావికమతం: మండలంలోని 11 గ్రామాల్లో సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరందించే ప్రధాన సాగునీటి వనరు కల్యాణపులోవ రిజర్వాయర్. ఇంతవరకు పూడిక, గండ్లతో అస్తవ్యస్తంగా మారిన ఆ రిజర్వాయర్ కాలువలన్నీ పూడిక తీతతో నేడు కళకళలాడుతున్నాయి. 1800 మంది కూలీలు నెల రోజుల పాటు శ్రమించి ఉపాధి హామీ పథకంలో పూడిక తీత పనులు చేశారు. ఈ పనులకు రూ.32 లక్షలు ఖర్చు చేశారు. ప్రధాన కాలువతో పాటు పిల్లకాలువల్లో పూడిక తొలగించారు. దీంతో ఆయకట్టు రైతుల ఏళ్లనాటి కల నెరవేరింది. ఇకపై రిజర్వాయర్ నీరు విడుదల చేసిన రెండు రోజుల్లోనే నేరుగా ఆయకట్టు భూములన్నింటికీ అందనుంది. కల్యాణపులోవ రిజర్వాయర్ ప్రధాన కాలవ 13 కిలో మీటర్ల మేర, పిల్లకాలువలు మరో 8 కిలోమీటర్లు 15 ఏళ్ల క్రితం సిమెంట్ లైనింగ్ చేశారు. అప్పటి నుంచి ఏనాడూ పూర్తి స్థాయిలో పూడిక తీత పనులు చేపట్టక పోవడంతో కాలువల్లో తుప్పలు,మట్టి పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. దీంతో రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా 20 క్యూసెక్కుల నీరు విడుదల చేసినా దొండపూడి,కొత్తకోట,మర్రివలస,మత్స్యవానిపాలెం భూములకు చేరేది కాదు. రైతులు ఆందోళనలు చేసినప్పుడు అదనంగా 3 క్యూసెక్కుల నీరు విడుదల చేసేవారు. కాలువల్లో పూడిక కారణంగా ఏదో ఒక చోట పొంగిపోయి నీరు వృథాగా పోయేది. జెడ్.కొత్తపట్నం,దొండపూడి మధ్య రెండు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. కాలువల్లో పూడిక తీయాలని కోరుతున్నా తగినన్ని నిధులు లేక పనులు చేపట్టలేదు. ఇప్పుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొత్తకోట,దొండపూడి గ్రామాల్లో పర్యటించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ దృష్టికి ఈ సమస్యను పలువురు రైతులు తీసుకువచ్చారు. ఆయన ఇరిగేషన్,ఉపాధిహామీ పథకం అధికారులతో సమీక్ష చేసి ఉపాధి హామీలో కాలువల్లో పూడికతీయాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు చేసేందుకు ఒప్పించారు. నాలుగు అడుగుల మేర పేరుకుపోయిన మట్టి, తుప్పలను పూర్తిగా తొలగించారు. ఇప్పుడు కాలువలన్నీ కళకళలాడుతున్నాయి. ఇక తమకు సాగునీరు సమస్య ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పూడిక తీయకముందు కాలువ(ఫైల్)

ఏళ్ల తరబడి ఇబ్బందులు పడ్డాం



కాలువల్లో పూడిక తీయకపోవడంతో సాగునీరు సరిగా అందక ఏళ్ల తరబడి ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు ఎమ్మెల్యే ధర్మశ్రీ చొరవ తీసుకుని పనులు చేయించారు. ఇకపై నీరు సమృద్ధిగా అందుతుంది.

– గర్రెడ్డి తాతబాబు, రైతు, దొండపూడి

ఆనందంగా ఉంది



ఉపాధి హామీ పథకంలో కాలువ పనులు చేయించడం వల్ల ఇక్కడి రైతులకు రెండు నెలల పాటు పనులు దొరికాయి. ఏనాటి నుంచో కాలువల్లో నాలుగడుగుల మేర పేరుకుపోయిన బురద,తుప్పలు తొలగి, నీరు పారేందుకు అనుకూలంగా ఉంది. చాలా ఆనందంగా ఉంది.

– గాలి రమణబాబు, రైతు,జెడ్.కొత్తపట్నం

ఎమ్మెల్యే ధర్మశ్రీ చొరవతో..



రెండేళ్లుగా ఉపాధి హామీ పథకంలో పనులు చేయాలని నిర్ణయించినా సాంకేతిక సమస్యలతో ఆటంకాలు ఏర్పడేవి. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషి మేరకు పలు గ్రామాల పనిదినాల్లో చేర్చి కాలువల్లో పూర్తిగా పూడికతీసి రైతుల కల నెరవేర్చాం.

– దాడి వెంకట కాశీ అప్పారావు, ఏపీవో, రావికమతం.

ఇబ్బందులు తొలగాయి



ఏళ్లతరబడి పూడికపోవడంతో నీరు సరిగా పారేది కాదు. నీటినిఎక్కువగా విడుదల చేసినా ప్రయోజనం అంతంత మాత్రంగా ఉండేది.కాలువలపై గస్తీ ఏర్పాటుచేసి నీరు పార్లిపోకుండా చూసే వాళ్లం. పలు చోట్ల గండి పడి నీరు వృథాగా పోయేది. కాలువుల్లో పూడిక తీయడంతో ఇప్పుడా ఇబ్బందులు లేవు. – సత్యనారాయణ దొర, ఏఈ, రిజర్వాయర్ కొత్తకోట సెక్షన్

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్

ఎస్.రాయవరం : నర్సీపట్నం రోడ్డు రేగుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య ఏదో గుర్తు తెలియని రైలు నుంచి యువకుడు జారిపడి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ ఆదివారం తెలిపారు. విశాఖపట్నం వైపు వెళ్లే రైలు మార్గంలో బ్లూ చొక్కా, జీన్ ఫ్యాంటు ధరించి ఉన్న సుమారు 30 ఏళ్ల వయస్సు గల యువకుడు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్టు తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచినట్టు తెలిపారు. సెల్ ఫోన్ వివరాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రెండు పశువుల పాకలు దగ్ధం

కశింకోట : జమాదుపాలెం గ్రామంలో శనివారం రాత్రి రెండు పశువుల పాకలు కాలిపోయాయి. ఎవరికీ ఎటువంటి హాని జరగలేదు. ఇందుకు కారణం తెలియరాలేదు. అయితే పాకలకు గిట్టని వారు నిప్పు పెట్టి కాల్చివేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితులు నిరసన తెలిపారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు మాజీ ఉప సర్పంచ్ ఒమ్మి గంగు నాయుడు తెలిపారు.

‘ఆటోమేటెడ్’తో లెక్క పక్కా

- త్వరలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ అందుబాటులోకి..
- వాహన సామర్థ్య పరీక్షల్లో కచ్చితత్వం
- రాష్ట్రంలో తొలిసారిగా గంభీరంలో ఏర్పాటు
- రూ.16.5 కోట్ల వ్యయంతో నిర్మాణం
- ఇకపై మాన్యువల్ టెస్ట్‌లకు స్వస్తి



గంభీరంలో పూర్తికావస్తున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్



నిర్మాణం పూర్తి చేసుకున్న డ్రైవింగ్ ట్రాక్

సాక్షి, విశాఖపట్నం: వాహనాల సామర్థ్య పరీక్షల నిర్వహణకు సరికొత్త టెస్టింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తోంది. విశాఖ జిల్లా రవాణా శాఖకు సంబంధించి రాష్ట్రంలోనే తొలిసారిగా ఆనందపురం మండలం గంభీరంలో ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ఏర్పాటవుతోంది. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఈ స్టేషన్‌కు రూ.16.5 కోట్లు మంజూరు చేసింది. దీనికి అదనంగా డ్రైవింగ్ ట్రాక్‌కు రూ.కోటి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.75 లక్షలు కేటాయించింది. ప్రస్తుతం ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇంకా రూఫ్ షీట్, ఫ్లోరింగ్ వంటి సివిల్ పనులు జరుగుతున్నాయి. అలాగే డ్రైవింగ్ ట్రాక్ రోడ్ల పనులు పూర్తయ్యాయి. ఈ రోడ్లపై సెన్సార్లను అమర్చాల్సి ఉంది. ఈ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి కానుంది. మరో నెలన్నర రోజుల్లో దీనిని ప్రారంభించేందుకు రవాణా శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఇప్పటి వరకు ఇలా..

ఇప్పటివరకు బస్సులు, లారీలు, కార్లు, వ్యాన్లు, జీపులు, ఆటోలు వంటి వివిధ వాహనాలకు ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాల్లో మాన్యువల్ విధానంలో సామర్థ్య (ఫిట్‌నెస్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. ప్రస్తుత మాన్యువల్ విధానంలో నిర్వహించే పరీక్షల్లో పారదర్శకత ఉండడం లేదని, కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరిగే సామర్థ్యం లేకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేకాదు.. మాన్యువల్ విధానంలో వాహన స్థితి పూర్తిస్థాయిలో నిర్ధారించడం కూడా సాధ్యం కావడం లేదు. ఫలితంగా వాహనాల కండిషన్‌పై సమగ్రత లేని సర్టిఫికెట్ల జారీ వల్ల అవి ప్రమాదాలకు గురవుతున్నాయి. కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఇకపై ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే ప్రమాదాలు, కాలుష్యాలను నియంత్రించే వీలుంటుంది.

16 రకాల పరీక్షలు

కొత్త ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో వాహనాలకు నిర్వహించే పరీక్షలకు మనుషుల ప్రమేయం అవసరం ఉండదు. నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా వాహనాల నాణ్యత, పనితీరు, వినియోగ అర్హత/సామర్థ్యం వంటివి కంప్యూటర్, సెన్సార్ల పరిజ్ఞానంతో ధృవీకరించే వీలుంటుంది. ఇలా ఈ స్టేషన్‌లో పీయూసీ (పొల్యూషన్ అండర్ కంట్రోల్), సౌండ్ టెస్ట్, స్పీడోమీటరు, సైడ్ స్లిప్, సస్పెన్షన్ టెస్ట్, బ్రేక్ టెస్ట్, స్టీరింగ్ టర్నింగ్ యాంగిల్, యాక్సిల్ ప్లే డిటెక్టర్, హెడ్‌లైట్ సెంటరింగ్ వంటి 16 రకాల పరీక్షలను క్షుణ్ణంగా నిర్వహిస్తారు. వాహనాల నుంచి వెలువడిన కాలుష్య కారకాలను గుర్తించి పీయూసీ సర్టిఫికెట్లకు అర్హత ఉన్నదీ, లేనిదీ కంప్యూటర్ ఆపరేటెడ్ డివైజ్‌లు నిర్ధారిస్తాయి. ఎలక్ట్రికల్, మెకానికల్ లోపాలను గుర్తిస్తాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వాహనంలో ఏ లోపాలున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీకి వీలుపడదు. కంప్యూటర్ గుర్తించిన లోపాలను సరిచేశాకే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ అవుతుంది. మాన్యువల్ సర్టిఫికెట్ మాదిరిగా మార్పులు, చేర్పులకు వీలుండదు. ఇలా ఆటోమేటెడ్ టెస్టింగ్ ద్వారా సంబంధిత వాహనం సామర్థ్య పరీక్షల్లో కచ్చితమైన నివేదిక వస్తుంది. ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌లో రోజుకు వంద వరకు వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షించే వీలుంటుంది.

త్వరలో అందుబాటులోకి..



గంభీరంలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. సివిల్ వర్కులు కూడా వేగంగా జరుగుతున్నాయి. డ్రైవింగ్ ట్రాక్ కూడా పూర్తయింది. ఈ రోడ్లపై సెన్సార్లను అమర్చాల్సి ఉంది. మరో నెలన్నరలోపు ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తుంది. ఈ స్టేషన్‌లో ఉండే సాంకేతికతతో వాహనాల సామర్థ్య పరీక్షలు కచ్చితత్వంతో పాటు సమర్థవంతంగా జరుగుతాయి.

– జీసీ రాజారత్నం, డీటీసీ, విశాఖపట్నం

మైనార్టీల అభ్యున్నతికి సీఎం కృషి

హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాథ్ బ్రోచర్‌ను విడుదల చేసిన డిప్యూటీ సీఎం



ముకుందపురంలో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ముస్లింలు

మాడుగుల రూరల్: మైనార్టీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని ముకుందపురంలో మండల కోఆప్షన్ సభ్యురాలు షేక్ అహ్మద్ ఉన్నీసాతో పాటు రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ ఐ.హెచ్. ఫారూక్, విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల మైనార్టీల కోఆర్డినేటర్ బర్కత్‌అలీ, అనకాపల్లి జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఖాజీ ఉద్దీన్‌బాబా, సీనియర్ కార్యవర్గ సభ్యుడు గౌస్ ఆదివారం డిప్యూటీ సీఎంను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం హర్ దిల్ మే వైఎస్సార్ – హమ్ సబ్ జగన్‌కే సాథ్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ప్రధానంగా ఉర్దూ భాషకు రాష్ట్ర అధికార ద్వితీయ హోదా కల్పించడం, హజ్ మక్కా యాత్రకు 2022–23 సంవత్సరంలో 1,164 మందికి రూ.5.52 కోట్ల సాయాన్ని అందించడం, రాజకీయాల్లో సముచిత స్థానం ఇవ్వడంతో వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీను, సర్పంచ్ కర్రి గణేశ్, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం పాల్గొన్నారు.

టీడీపీ బస్సు యాత్రకు కొరవడిన స్పందన

- చోడవరంలో స్థానిక నాయకులతో మమ అనిపించిన వైనం

చోడవరం: తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్రకు చోడవరంలో జనం స్పందన కొరవడింది. సాధారణ వీధి సమావేశానికి వచ్చినంత మంది కూడా ఈ బస్సు యాత్రకు, సభకు హాజరుకాకపోవడం ఆ పార్టీ కేడర్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ జిల్లాలో చేపట్టిన టీడీపీ బస్సు యాత్ర ఆదివారం చోడవరం నియోజకవర్గం వెలంకాయపాలెంలో ప్రారంభమై రోలుగుంట, కొత్తకోట, రావికమతం, వడ్డాది, విజయరామరాజుపేట మీదుగా చోడవరం చేరుకుంది. కేవలం జిల్లాకు చెందిన స్థానిక నాయకులతోనే యాత్ర ఉండటంతో పార్టీ కేడర్ నిరుత్సాహానికి గురైంది. రావికమతం, చోడవరం పట్టణంలో బహిరంగ సభలు నిర్వహించగా, చోడవరం సభకు జనం లేక వెలవెలబోయింది. పట్టణంలోకి ప్రవేశించిన బస్సు యాత్రకు స్వాగతం పలికేందుకే జనం లేక పేలవంగా సాగింది. ఇక్కడి వినాయకుడి గుడి సమీపంలో రెండు మూడు వందల కుర్చీలు వేసి సభను మమ అనిపించారు. ఇక టీడీపీ హయాంలో చోడవరం హైస్కూల్ గ్రౌండ్ వద్ద వేసిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు శిలాఫలకం వద్ద, ఎల్.బి.పురం ఎత్తిపోతల పథకం శిలాఫలకం వద్ద నాయకులంతా సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఎప్పుడూలాగే తన దురుసుతనం ప్రసంగంతో ప్రభుత్వం పనితీరుపై విమర్శలు గుప్పించారు. గత టీడీపీ హయాంలోనే పరిష్కారం కాని సహకార సుగర్ ఫ్యాక్టరీల మూసివేత, బీఎన్‌రోడ్డుకు మరమ్మతులపై టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని నిందించడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ యాత్రలో చోడవరం, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యేలు కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, పీలా గోవింద సత్యనారాయణ, చోడవరం, యలమంచిలి నియోజకవర్గాల ఇన్‌చార్జులు బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

కశింకోట : మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన విద్యార్థిని కనిపించకపోవడంతో శనివారం ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. సియ్యాదుల మానస అనే విద్యార్థిని యలమంచిలి ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటుంది. శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లిన మానస తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద భోగట్టా చేసినా ఆమె ఆచూకీ లేకపోవడంతో తండ్రి నరసింగరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

మాకవరపాలెం : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని తూటిపాల శివారులో ఉన్న గుండుబాడు గెడ్డతోపాటు పక్కనే ఉన్న జిరాయితీ భూముల్లో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో రెండు ట్రాక్టర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. వీటిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

కాయిన్ గేమ్ ఆడుతున్న 11 మంది అరెస్టు



పట్టుబడిన వారితో పోలీసులు

మాకవరపాలెం : కాయిన్ గేమ్ ఆడుతున్న 11 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని తూటిపాల శివారు తోటల్లో కాయిన్ గేమ్ నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారంతో ఆదివారం సాయంత్రం సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో మండలంలోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన 11 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి 11 బైక్‌లు, రూ.25,120 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

గిరిజన యువతి అదృశ్యం



సాప్పాయి

చింతపల్లి : మండలంలోని కుడుముసారెకు చెందిన గిరిజన యువతి అదృశ్యమైనట్టు స్థానిక ఎస్ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. గ్రామానికి చెందిన మర్రి సాప్పాయి(27) ఈ నెల 19న బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి కనిపించకుండా పోయినట్టు తండ్రి వీరయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఆచూకీ తెలిసిన వారు 9440904238కు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



మచ్చమ్మ(ఫైల్)

చీడికాడ : కనిపించకుండా పోయిన మహిళ ఆచూకీ తెలపాలని ఎస్ఐ రామారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తునివలసకు చెందిన గంట్ల మచ్చమ్మ(45) శనివారం ఉదయం నుంచి కనిపించకుండా పోయిందన్నారు. కుటుంబ సభ్యులు వెతకగా ఎటువంటి ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904210 సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్కూటీపై వెళుతున్న వ్యక్తిని పల్సర్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో వెదురువాడకు చెందిన పుర్రె ధోనీ (17) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

గతంలోనూ మూడు సార్లు ఆత్మహత్యాయత్నం



ఆదినారాయణ(ఫైల్)

గోపాలపట్నం: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్ఏడీ రైల్వే వంతెన దిగువన ఈ ఘటన చోటు చేసుకుంది. గతంలోనూ మూడుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. మురళీనగర్‌కు చెందిన బల్లంకి ఆదినారాయణ(23) డ్రైవర్‌గా, కొరియర్ బాయ్‌గా చేసుకుంటూ తల్లిదండ్రుల వద్ద జీవిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను రాత్రికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం రైల్వే ట్రాక్‌పై మృతదేహం ఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సెల్‌ఫోన్, దుస్తులు ఆధారంగా ఆదినారాయణగా గుర్తించారు. శనివారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని తెలిపారు. ఆతని కుటుంబ సభ్యులు చేరుకుని.. ఛిద్రమైన మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. గతంలో మూడు సార్లు ఆత్మహత్యకు పాల్పడగా, కాపాడారు. శనివారం రాత్రి 11 గంటలకు ఆదినారాయణ తన స్నేహితుడైన మౌళి ఫోన్ చేసి చనిపోతున్నట్లు చెప్పాడు. మౌళి ఈ విషయాన్ని ఆదినారాయణకు అన్నయ్యకు తెలిపాడు. అతను ఆదినారాయణకు ఫోన్ చేయగా.. నేను రైల్వే ట్రాక్‌పై ఉన్నాను.. ట్రైన్ దగ్గరకు వచ్చేస్తోంది చెబుతుండగానే ఫోన్ ఆగిపోయింది. అతని ఆత్మహత్యకు గల కారణం తెలియరాలేదు. తన కుమారుడికి పెళ్లి సంబంధాలు చూస్తున్నామని, ఇంట్లో ఎటువంటి గొడవలు జరగలేదని తల్లిదండ్రులు చెబుతున్నారు. తండ్రి బల్లంకి బంగారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

కిక్ బాక్సింగ్ విజేతలు అర్షిత, పృథ్వీ

విశాఖ స్పోర్ట్స్: విశాఖ డిస్ట్రిక్ట్ కిక్‌బాక్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ ప్రో కిక్‌బాక్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. గోకుల్ పార్క్ వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో 18 జిల్లాల నుంచి 70 మంది బాక్సర్లు పాల్గొన్నారు. 51 కేజీల మహిళా విభాగంలో విశాఖ జిల్లాకు చెందిన బి.అర్షిత విజేతగా నిలవగా తూర్పుగోదావరికి చెందిన అక్షిత ద్వితీయ స్థానంలో నిలిచింది. మెన్ విభాగంలో పృథ్వీ, బాల తొలి రెండు స్థానాల్లో నిలిచారు. పోటీల ముగింపు కార్యక్రమానికి కిక్‌బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు, సామాజికవేత్త జి.వి.రామచంద్రరావు హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

చదరంగం పోటీల్లో భార్గవ్, రుత్విక్ విజేతలు

- సత్తాచాటిన సత్యతేజేశ్వర్
- ఉత్సాహంగా చదరంగం పోటీలు



తనీష్‌తో తలపడుతూ ఎత్తుకుపైఎత్తుతో చిత్తుచేసిన తేజేశ్వర్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ జిల్లా రాపిడ్ చదరంగం పోటీల్లో భార్గవ్‌రామ్, బ్లిజ్ చదరంగంలో వెంకట్‌రుత్విక్ విజేతలుగా నిలిచారు. రెండు అంశాల్లోనూ సత్యతేజశ్వర్ సత్తా చాటాడు. రాపిడ్ చెస్ 76 మంది ఏడు రౌండ్లలో పోటీపడగా బ్లిజ్‌లో 44 మంది ఆరురౌండ్లలో పోటీపడ్డారు. రాపిడ్‌లో భార్గవ్ ఏడు పాయింట్లతో నిలవగా సత్యతేజేశ్వర్ ఆరుపాయింట్లతో రన్నర్‌గా నిలిచాడు. రాపిడ్ చివరి రౌండ్‌లో సాయిశశాంక్‌పై భార్గవ్‌రామ్ విజయంతో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. బ్లిజ్‌లో వెంకట్ రుత్విక్ ఆరుపాయింట్లు సాధించగా సత్యతేజశ్వర్ ఐదు పాయింట్లతో నిలిచాడు. బ్లిజ్ చివరి రౌండ్‌లో వై.భార్గవ్‌పై వెంకటరుత్విక్ ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. రాపిడ్‌లో కృష్ణ ఆరు పాయింట్లు సాధించగలిగినా ప్రొగ్రెసివ్‌లో వెనుకబడి తృతీయ స్థానంతో సరిపుచ్చాడు. బ్లిజ్‌లో సాయిభార్గవ్, సాయిశశాంక్‌లు సైతం ఐదేసి పాయింట్లు సాధించగలిగినా ట్రైబ్రేక్స్ వెనుకబడటంతో వరుసగా మూడు, నాలుగు స్థానాల్లోనే నిలిచిపోయారు. ఆల్ విశాఖ చెస్ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణామందిర్‌లో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు జిల్లా జట్టుగా భీమవరంలో జరగనున్న స్టేట్ అంతర జిల్లాల టోర్నీలో పాల్గొనున్నారు.

స్వీయశక్తిపై నమ్మకంతోనే గెలుపు

ఉత్సాహంగా ముగిసిన ‘యువ ఉత్సవ్ – 2023’

అనకాపల్లి టౌన్: స్వీయశక్తి సామర్థ్యాలపై నమ్మకం ఉన్నవారు పోటీల్లో విజేతలుగా నిలుస్తారని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ పి.శ్రావణ్‌కుమార్ అన్నారు. గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ×యువ ఉత్సవ్ – 2023৷ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోటీల ముసుగులో సృజనాత్మకత విలువలు మరవొద్దని సూచించారు. పోటీలు సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదపడతాయని, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడానికి సహాయకారిగా ఉపయోగపడుతుందని చెప్పారు. పోటీల్లో పాల్గొనే ఔత్సాహికులు తమలో దాగిన సామర్థ్యాన్ని సరైన రీతిలో ఉపయోగిస్తే కఠిన శిలల మధ్యే విశాల హర్మ్యాలు నిర్మించవచ్చని వివరించారు. పేదరికం నుంచి సంపదలు సృష్టించవచ్చన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్.వై.కే రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, గౌరీ గ్రంథాలయం సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నా.. నోరు అదుపులో పెట్టుకో...

నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ ఆగ్రహం



ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సైకోలా ప్రవర్తిస్తున్నాడని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టీడీపీ నాయకులు సొల్లు యాత్ర చేస్తున్నారని విమర్శించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడికి వృద్ధాప్యం రావడంతో మనోవేదనకు లోనై పిచ్చెక్కి మాట్లాడుతున్నాడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సొల్లు కబుర్లు మాని నిజం మాట్లాడితే ప్రజలు హర్షిస్తారని హితువు పలికారు. 2014 ఎన్నికల్లో 600 హామీలిచ్చి 60 కూడా నెరవేర్చని తోడు దొంగలు ఎవరైనా ఉన్నారంటే చంద్రబాబు, అయ్యన్నపాత్రుడే అని, రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడీ దొంగలని దుయ్యబట్టారు. డ్వాక్రా మహిళలు, రైతులను మోసం చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. అన్ని వర్గాలను మోసం చేసి తమ నాయకులను విమర్శిస్తే తగిన బుద్ధి చెప్పుతామని హెచ్చరించారు. ఎన్నికల హామీల్లో 98 శాతం నెరవేర్చిన దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు వేల పింఛన్ ఎక్కడ ఇస్తున్నారని బుద్ధి లేకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పింఛన్ పెంచుకుంటూ వెళ్తున్నామన్నారు. ప్రస్తుతం రూ.2,750 ఇస్తున్నాం, వచ్చే జనవరి నుంచి రూ.3 వేలు ఇస్తామన్నారు. తుగ్లక్ అయ్యన్నకు ఐదేళ్ల అధికారంలో నూకాలతల్లి గుడి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇంటి ఇలవేల్పుగా చెప్పుకునే వ్యక్తి 2019 ఎన్నికల ముందు రూ.10 లక్షల దండికట్టి, నిధులు తీసుకురాలేక చేతులెత్తేశాడని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.40 లక్షలతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికైనా సొల్లు కబుర్లు మానుకొని...నోరు అదుపులో పెట్టుకోవాలని హితువు పలికారు.

స్కూటీ ప్రమాదంలో కుమార్తె మృతి, తండ్రికి గాయాలు

కశింకోట : కశింకోట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మృతి చెందగా, తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాలివి. నాతవరం మండలం గుమ్మడిగుండ గ్రామం నుంచి విశాఖ వైపు వేగంగా వెళుతున్న స్కూటీ మార్గమధ్యంలో కశింకోట వద్ద అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో స్కూటీ నడుపుతున్న విశాఖలోని విశాలాక్షినగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి బల్లంకి నాగేశ్వరరావు, వెనుక కూర్చున్న కుమార్తె అల్లవరపు నాగ సత్యవతి (26) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యవతి మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. కుమార్తె ఇంటికి చుట్టపు చూపుగా వచ్చిన నాగేశ్వరరావు తిరిగి విశాఖ వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. నాగేశ్వరరావు కుమారుడు నానిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతురాలు గృహిణి. ఆమెకు ఐదేళ్ల కుమార్తె అభిశ్రీ, ఏడేళ్ల కుమారుడు యువతేజ ఉన్నారు.

నాతో సెల్ఫీ కావాలా.?

- 10 మొక్కలు నాటండి.. ఎందుకంటే.?
- వాల్తేరు డీఆర్ఎం కొత్త నిబంధన



డీఆర్ఎం కార్యాలయం

సాక్షి, విశాఖపట్నం: నాతో మీకు సెల్ఫీ కావాలా? అయితే పర్యావరణ పరిరక్షణ కోసం 10 మొక్కలు నాటండి.. అప్పుడే మీకు సెల్ఫీ ఇస్తాను. లేదంటే.. లేదు.. ఇదీ వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలు. సెల్ఫీ కోసం ఎందుకీ నిబంధనలు అనేగా మీ డౌటనుమానం! అయితే ఈ కథనం చదివేయండి.

ఇటీవల వాల్తేరు డివిజన్ పరిధిలో రైల్వే ఉద్యోగాలు ఇస్తామంటూ రూ.లక్షల వసూళ్లకు పాల్పడి మోసం చేసిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వీరిలో చాలా మంది మోసగాళ్లు డీఆర్ఎంతో సెల్ఫీ దిగిన ఫొటోలను యువతకు చూపించిన మోసం చేసినట్లు రైల్వే అధికారులు గుర్తించారు. ఈ తరహా మోసగాళ్లకి చెక్ పెట్టేందుకు మార్గదర్శకాలు జారీ చేయాలని తన కార్యాలయ వర్గాలను డీఆర్ఎం ఆదేశించారు. రైల్వే అధికారిక కార్యక్రమాల్లో ఇతరులెవ్వరూ హాజరుకాకుండా చర్యలు తీసుకోవాలని, రైల్వే ఉద్యోగులెవ్వరైనా డీఆర్ఎంతో సెల్ఫీ దిగొచ్చని స్పష్టం చేశారు. బయట వ్యక్తులెవ్వరైనా సెల్ఫీ అడిగితే.. వారు కచ్చితంగా క్యాలెండర్ ఈయర్‌లో 10 మొక్కలు నాటుతామని హామీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. సెల్ఫీ దిగే వ్యక్తిపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేయడంతో పాటు పూర్తి వివరాలను డీఆర్ఎం సెక్రటేరియట్‌కు అందించాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ సర్క్యులర్ డివిజన్ పరిధిలో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

పరశురాముడిగా జగన్నాథుడు


కశింకోటలో పరశురాముడి అవతారంలో జగన్నాథ స్వామి

కశింకోట: స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామి ఆదివారం పరశురాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విష్ణుమూర్తి దశావతారాల్లో ఆరో అవతారంగా పరశురాముడిగా జగన్నాథస్వామిని అలంకరించి విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు ఈ వేడుక నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాపుశెట్టివానిపాలెంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లి టౌన్: మండలంలో రేబాక సచివాలయ పరిధిలో కాపుశెట్టివానిపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళి

అనకాపల్లి టౌన్: స్థానిక ఉదయశాంతి వృద్ధాశ్రమంలో పొట్టి శ్రీరాములు పరిరక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు పి.ఎం.ఎల్.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకు ముందు విద్యార్థులకు లక్ష్మీబాయి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులతో పాటు బిస్కెట్లు అందజేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నాయుడుబాబు


నాయుడుబాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల బీజేపీ అధ్యక్షునిగా కూండ్రపు నాయుడుబాబు నియమితులయ్యారు. మండలంలోని భోగాపురానికి చెందిన నాయుడుబాబును ఆదివారం అచ్యుతాపురంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు, రాజాన రాజు, గొంతిన భక్త సాయిరాం, రాజబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మనుచరిత్ర	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
మేమ్ ఫేమస్	: సత్యనారాయణ స్క్రీన్-2
1920	: షిర్డిసాయి
అశ్వనీస్	: పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచ్(3 ఆటలు)	
ది ఫ్లాష్ (మ్యాట్నీ)	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఓ నెగిటివ్ 4 యూనిట్లు, ఏబీ పాజిటివ్ 5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

ఇక సాఫీగా ప్రయాణం

- నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి సన్నాహాలు
- రూ.52 కోట్లతో అంచనా
- మూడు మండలాల ప్రజలకు సౌకర్యం


ఫ్లై ఓవర్ వంతెన నిర్మించనున్న నరసింగబిల్లి రైల్వే గేటు ప్రాంతం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నరసింగబిల్లి-కొండకర్ల రహదారిలో వంతెన నిర్మాణానికి రూ.52 కోట్లు ఖర్చవుతుందని రైల్వే శాఖ అధికారులు అంచనా వేశారు. దీని నిర్మాణం పూర్తయితే ప్రధానంగా మూడు మండలాల ప్రజలకు ఆటంకం లేకుండా రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది.

రైల్వే గేటు వద్ద నిరీక్షణ

నరసింగబిల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటు రైళ్ల రాకపోకల సమయంలో తరచుగా మూసి ఉంటోంది. దీని వల్ల ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహన చోదకులు, ఆటోలు, కార్లు, పెద్ద వాహనాలు నడిపే వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ గేటు విశాఖ-విజయవాడ మధ్య ఉన్న ప్రధాన రైలు మార్గంలో ఉంది. ఈ దారిలో రోజుకూ సుమారుగా 200 వరకు రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక రైలు వచ్చినప్పుడు గేటు వేస్తే సుమారు పది నిమిషాల పాటు వాహన చోదకులు నిరీక్షించాల్సి వస్తోంది. అదే రెండు రైళ్లకు అయితే పావుగంట పాటు నిరీక్షించాలి. గూడ్స్ రైళ్లు, ఒక్కోసారి మూడు రైళ్లు దాటేటప్పుడు ఇంకా ఎక్కువ సమయం పాటు వేచి ఉండాల్సిందే. దీంతో వాహన చోదకులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. సకాలంలో తమ గమ్యాలకు చేరలేకపోతున్నామని, అత్యవసర పరిస్థితిలో మరింత ఇబ్బందులు గురి కావలసి వస్తోందని వాపోతున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మించాలని చాలా కాలంగా ఈ ప్రాంత ప్రజలు, వాహన చోదకులు అధికారులను కోరుతూ వస్తున్నారు.

అధికారుల సన్నాహాలు

ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్‌లు నిర్మించాలని రైల్వే శాఖ అధికారులు భావిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే నరసింగబిల్లి గేటు రోడ్లు, భవనాల శాఖకు చెందిన నరసింగబిల్లి-కొండకర్ల రోడ్డు మధ్య ఉంది. దీంతో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణానికి రోడ్లు, భవనాల శాఖ అధికారులు కూడా తమ పరంగా రైల్వే శాఖకు సహకారం అందించారు. రైల్వే అధికారులు అంచనాలు రూపొందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. మండల గ్రామస్తులు, మునగపాక, అచ్యుతాపురం ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి నరసింగబిల్లి-కొండకర్ల రోడ్డు దగ్గరి మార్గం. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణం పూర్తయితే ఆయా మండలాల గ్రామాల ప్రజలు సాఫీగా ప్రయాణాలు సాగించేందుకు ఆటంకం లేకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

నివేదిక అందించాం

నరసింగబిల్లి-కొండకర్ల రోడ్డులో నరసింగబిల్లి రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ వంతెన నిర్మించడానికి రైల్వే శాఖ యోచిస్తోంది. సుమారు రూ.52 కోట్లతో అంచనాలు వేసినట్లు సమాచారం. ఇందుకు తమ శాఖ పరంగా కావలసిన సమాచార నివేదికను అందించాం.

– అంజనేయరాజు, ఇన్‌చార్జి ఏఈ, రోడ్లు, భవనాల శాఖ, యలమంచిలి డివిజన్

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు


నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో భక్తులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు ఆదివారం కావడంతో అనకాపల్లితో పాటు విశాఖ, విజయనగరం జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువ పందిళ్లలో వంటలు చేసుకుని అమ్మవారికి నివేదించి కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు తమ పిల్లలకు పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగతా వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపివేశారు.

శ్రీ సఖి సేవా సమితి ఉదారత


విద్యార్థులతో సేవా సమితి సభ్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ విద్యార్థులకు రూ. లక్షా యాభై వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, స్టేషనరీ, బియ్యం, కూరగాయలను విశాఖ పట్నం మురళీనగర్‌కు చెందిన శ్రీ సఖీ సేవా సమితి సభ్యులు ఆదివారం అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు పీఎస్‌టీ పట్నాయక్ సమక్షంలో శ్రీ సఖీ సేవా సమితి వ్యవస్థాపకురాలు బిందు రాణి చేతుల మీదుగా అందజేశారు. బిందు రాణి మాట్లాడుతూ అచ్యుతాపురం ఆశ్రమానికి తాము ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందని, పట్నాయక్ వంటి ఉదారత కలిగిన వ్యక్తుల ఆధ్వర్యంలో ఆశ్రమ విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గవరపాలెం ఎంజీహెచ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం శంకరంలోని బొజ్జన్నకొండ వద్ద గవరపాలెం ఎంజీహెచ్(చిన్న) హైస్కూల్ 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలుసుకుని రోజంతా సరదాగా గడిపారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలు, తరగతి గదుల్లో సరదాలను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు ఆటపాటలతో కొండ పరిసరాలలో సందడి చేశారు. ఆర్థికంగా వెనకబడిన తమ తోటి పూర్వ విద్యార్థులకు కష్టకాలంలో భరోసా కల్పించేలా కమిటీ ఏర్పాటుకు తీర్మానం చేశారు.

బ్రాండిక్స్‌లో 395 మందికి వైద్య పరీక్షలు


కళ్లద్దాలు అమర్చుతున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ పార్కులో ఆదివారం చేపట్టిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 395 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 303 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.79 మందికి మందులు అందజేశారు. 29 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి శిబిరంలో భాగంగా విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజన వసతులు కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకూ 109 కంటి వైద్య శిబిరాలను నిర్వహించామని తెలిపారు. సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలనేది తమ లక్ష్యం అని అన్నారు.

ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: ఎస్‌బీఐ ఫౌండేషన్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. అరబుపాలెంలో ఆదివారం ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 150 మంది రైతులకు రాయితీపై విత్తన పంపిణీ నిర్వహించారు. బస్తా రూ.1250 కాగా రైతులు తమ వాటాగా రూ.400 చెల్లించేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రైతుల సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఏరియా అధికారి కె.శ్రీకాంత్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

తీరంలో అలల ఉధృతి


తీరంలో ఎగిసి పడుతున్న అలలు

ఎస్.రాయవరం: అల్ప పీడనం ప్రభావంతో మండలంలో మేఘావృతం అయ్యి ఆదివారం చల్లని వాతావరణం నెలకొంది. ఉదయం చిరు కురిసిన తరువాత ఆకాశం మబ్బులు కమ్ముకుని చల్లగాలులు వీచాయి. ఇక రేవుపోలవరం, బంగారమ్మపాలెం గ్రామాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేదు. తీరంలో కూడా మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. కెరటాల తీవ్రత మాత్రం పెద్దవిగా రావడంతో మత్స్యకారులు ఒడ్డున ఉన్న తెప్పలు మరింత సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు.

తేలికపాటి వర్షం

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం 6 గంటల సమయంలో తేలిక పాటి చినుకులు పడ్డాయి. రోజంతా ఆకాశం మేఘావృతమైంది. అయితే ఆశించిన స్థాయిలో వర్షం పడలేదు. దీంతో రైతులు నిరాశ చెందారు. వర్షం పడితే నారు మడి దుక్కి పనులు మరో సారి చేసి విత్తనాలు వేసుకుందామని రైతులు భావిస్తున్నారు. అయితే వరణుడు కనికరించడం లేదు.

'జగనన్న సురక్ష'తో ప్రజా సమస్యల పరిష్కారం


తిమ్మరాజుపేటలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న ఉప సర్పంచ్ జగన్

మునగపాక: జగనన్న సురక్ష కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పచ్ కాండ్రేగుల జగన్ కోరారు. ఆదివారం ఆయన వలంటీర్లతో కలిసి సురక్ష పథకంపై అవగాహన కల్పించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉండి ఇంతవరకు ప్రభుత్వ పథకాలు దక్కని వారికి మరో అవకాశం కల్పించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సాయం

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో ఇటీవల పిడుగుపాటుతో మేకలు మృతిచెందిన బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. గత సోమవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు గ్రామంలోని సబ్బి రమణకు చెందిన 18 మేకలు మృతి చెందాయి. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, స్పెషల్ పీపీ కరణం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్


డ్రైనేజీ వ్యవస్థను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్


వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి

- 'అనకాపల్లి'ని అభివృద్ధి పథంలో నడిపిస్తా..
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రేబాకలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తుమ్మపాల: అడగకుండా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబంలో సొంత మనిషిగా నిలిచారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని రేబాకలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ముఖ్య అతిథులుగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. అగ్రిగోల్డ్ బాధితులకు రూ.160 కోట్లు రావాల్సి ఉందని, గ్రామానికి చెందిన బాధిత సంఘ నాయకుడు కరణం మాణిక్యాలరావు మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీలో దోభీఖానా ఏర్పాటు చేయాలని రజకులు కోరగా.. స్థలం పరిశీలించి కార్యాచరణకు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. సర్వే నంబర్ 98లో పూర్వ కాలంగా ఉన్న పాకలు తొలగించారని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా.. వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్ గంగాధరరావును ఆదేశించారు. దివ్యాంగుడు మంత్రి శ్రీనివాస్‌కు మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేయాలని అధికారులకు సూచించారు.

బస్సు యాత్రతో ప్రజలను మభ్యపెడుతున్న టీడీపీ..

ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ బస్సు యాత్రంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. గతంలో టీడీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో బుట్ట దాఖలైందని, సీఎం వైఎస్ జగన్ విడుదల చేసిన మ్యానిఫెస్టోను భగవద్గీతలా భావించి పథకాలు నూరు శాతం అమలు చేస్తున్నామని తెలిపారు. పేదలందరికీ మంచి చేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. భవిష్యత్‌లో జగన్ సర్కారే కొనసాగుతుందని, ప్రజలందరూ ఆయనకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా రూ.15 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థను మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు. ఎంపీటీసీ మంత్రి సంతోషం స్వగృహంలో వలంటీర్లు, సచివాలయ అధికారులతో ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీసి, సంక్షేమ పథకాలు అందని వారికి వాటిని అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్టూరు భాస్కరరావు, మంత్రి సత్యనారాయణ, బంటు ఏడుకొండలు, కోట సత్తిబాబు, వివిధ శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత సేవలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీ విష్ణు ఆస్పత్రి, ఇసాన్ ఆస్పత్రి, సన్‌రైజ్ డయాగ్నస్టిక్స్, సురక్షా హెల్త్ ఫౌండేషన్, హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రుల సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని ఎంపీటీసీ లాలం శ్రీను, ధర్మిరెడ్డి నాయుడుబాబు మీదుగా ప్రారంభించారు. 130 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, పాప్ స్మియర్, బోన్ మినరల్ డెన్సిటీ పరీక్ష, దంత, చర్మ సంబంధిత వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యులు అడిగర్ల సుధీర్, ధర్మిరెడ్డి వెంకటేశ్, సందీప్, వాసుబాబు, కన్నుంనాయుడు వైద్య పరీక్షలు చేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యురాలు నవ్య

పరవాడ: వాడచీపురుపల్లిలో సింహగిరి ఆస్పత్రి వ్యవస్థాపకుడు దివంగత కేవీరామన్ జ్ఞాపకార్థం ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని డాక్టర్ నవ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో 15 రోజులకోసారి సింహగిరి ఆస్పత్రిలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించాలని యోచిస్తున్నామన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్న రోగులకు ఆరిలోవలోని హెచ్‌సీజీ ఆస్పత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నామని డాక్టర్ నవ్య చెప్పారు. 52 మందికి వైద్య సేవలు అందించారు.

యోగాతో ఆరోగ్యం, ప్రశాంతత

అనకాపల్లి టౌన్: యోగాతో ఆరోగ్యం, ప్రశాంతత లభిస్తుందని ఎన్టీఆర్ వైద్యాలయ వైద్యాధికారి జి.కృష్ణ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు కోలపర్తి భవనంలో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రారంభమైన యోగా పోటీలు సాయంత్రం ముగిశాయి. ఈ పోటీలకు 8 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సుల వారు హాజరయ్యారు. విజేతలకు వైద్యులు కృష్ణ, అపర్ణ, భవన నిర్మాణ సంఘం వ్యవస్థాపకుడు కోలపర్తి జయబాబు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకటన

M.V.O.P No.8 /2021

... 1-1-8, ... 21 07 2023 ... 10.30 ...

బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

అనకాపల్లిటౌన్: మండలంలో బట్లపూడి శివారున పేకాట ఆడుతున్న 8 మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ నరసింగరావు తెలిపారు. వారి నుంచి రూ.7 వేలు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

కనుల పండువగా సిరిజ్యోతి పూజ


సిరిజ్యోతి పూజలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి ఉత్సవ మూర్తికి మొదటి అంతస్తులో ఆహుతులైన భక్తులందరూ క్షీరాభిషేకాలు నిర్వహించి ముగ్గురమ్మల ప్రాంగణానికి వచ్చి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి వారాహి సిరిజ్యోతి పూజ కనుల పండువగా జరిగింది. విదేశాల నుంచి వచ్చిన పలువురు భక్తులు వారి స్వహస్తాలతో వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.